ఎమ్మెల్యే శుభాకాంక్షలు



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, కార్పొరేటర్లకు, నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీకటిని పారద్రోలి వెలుగునిచ్చే దీపావళి పర్వదినం ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

పదవీ విరమణ పొందిన నెలలోనే పింఛన్ పత్రాలు

ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు టౌన్: పదవీ విరమణ పొందిన నెలలోనే ప్రయాస్ పథకంలో భాగంగా చందాదారులకు పింఛన్ పత్రాలను మంజూరు చేస్తున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో సెప్టెంబర్‌లో పదవీ విరమణ పొందిన 31 మందికి పింఛన్ పత్రాలు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమానికి పీఎఫ్ కమిషనర్–2 శ్రీదేవి, అకౌంట్ ఆఫీసర్ ప్రతిమ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



రూ. 3లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

మాదాపూర్: ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటుందని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ తెలిపారు. మాదాపూర్‌కి చెందిన పోచమ్మకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.3 లక్షల రూపాయలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రతి ఆదివారం ప్రత్యేక బస్సులు

మియాపూర్: కార్తీక మాసంను పురస్కరించుకుని ఆర్టీసీ మియాపూర్ డిపో–1 నుండి ప్రతి ఆదివారం పంచారామాలకు బస్సు నడుస్తుందని డిపో మేనేజర్ సింగం రామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 3, 10, 17, 24 తేదీలలో మధ్యాహ్నం 3 గంటలకు మియాపూర్ డిపో–1 నుండి బయల్దేరి సాయంత్రం 5 గంటలకు ఎంజీబీఎస్ చేరుకుని అక్కడి నుండి పంచారామాలకు బయల్దేరుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, భీమవరం, పాలకొల్లు,, ద్రాక్షారామం, సామర్లకోటలోని ఐదు శివాలయాలను సోమవారం రాత్రిలోపు దర్శించుకుని తిరిగి రాత్రి 10 గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు మియాపూర్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టికెట్ ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలని, హైదరాబాద్ చుట్టుప్రక్కల ప్రాంతాల వారు దగ్గర్లోని బస్టాండ్‌తో పాటు సమీప టీజీఎస్ ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలో బుకింగ్ చేసుకోవచ్చని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం 9959226153, 7659029882 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

గోపన్‌పల్లిలో ఘర్షణ

ఆరుగురికి గాయాలు

గచ్చిబౌలి: ఇంటి ముందు నిలబడి ఉన్న వ్యక్తికి బైక్ తగిలిన విషయంలో ఘర్షణ నెలకొంది. మంగళవారం రాత్రి గోపన్‌పల్లిలోని ఎన్టీఆర్ నగర్‌లో నిలబడి ఉన్న వ్యక్తికి ఇద్దరు యువకులు బైక్ తాకించారు. దీంతో అక్కడున్న స్థానికులు యువకులను మందలించి పంపారు. ఈ క్రమంలో తమపై దాడి చేశారని మరి కొంత మందిని తీసుకొచ్చి యువకులు దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరు వర్గాలు ఒకరిపై మరొకరు దాడికి పాల్పడిన ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. రాత్రి సమయంలో దాడులు జరగడంతో ఎన్టీఆర్‌నగర్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. గాయాలపాలైన వారు ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పటాన్‌చెరులో రూ.12 కోట్లతో ఇండోర్ సబ్‌స్టేషన్



విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

పటాన్‌చెరు: ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించేందుకు నూతన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణం, మండల పరిధిలోని రామేశ్వరం బండ, పోచారం పరిధిలో నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటు కోసం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కోతలు లేని నిరంతరాయ విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో 12 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 33/11 కేవి సబ్ స్టేషన్, పోచారం, రామేశ్వరం బండ పరిధిలో ఏడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో రెండు 33/11 కేవి సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ భాస్కరరావు, ఏడీ దుర్గాప్రసాద్, తహసీల్దార్ రంగారావు, రామేశ్వరంబండ మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతీనగర్ డివిజన్‌లోనూ..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యుత్ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని బీడీఎల్‌కాలనీ వద్ద నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. రూ.6 కోట్ల వ్యయంతో భారతీనగర్ డివిజన్‌లో నూతన సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటు వలన ప్రజలకు మరింత నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి, విద్యుత్‌శాఖ డీఈ భాస్కర్‌రావు, ఏడీ దుర్గాప్రసాద్, ఏఈ సంజీవరావు, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి కోసమే ఇంటింటి సర్వే

- నవంబర్ 5 నుంచి 20 వరకు నిర్వహణ
- జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి



చందానగర్ సర్కిల్ కార్యాలయంలో..



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: సమగ్రాభివృద్ధి కోసమే ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుందని జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలోని 1,73,066 నివాసాలలో నిర్వహించాల్సిన సమగ్ర సర్వేపై జోనల్ కార్యాలయంలో ఎన్యుమరేటర్లతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 5 నుంచి 20వ తేదీ వరకు ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. జోన్ పరిధిలోని నాలుగు సర్కిళ్ల పరిధిలో మొత్తం 2,211 ఎన్యుమరేటర్లు వివరాలను సేకరిస్తారన్నారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, ఓటరు కార్డు సహా ఇతర పత్రాలను ప్రజలు సిద్ధంగా ఉంచుకోవాలని ఎన్యుమరేటర్లకు సమాచారం మాత్రమే ఇవ్వాలని, ఎటువంటి జిరాక్సు పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఒక్కో ఎన్యుమరేటర్ 150 ఇళ్ళ నుంచి వివరాలను సేకరించాలని, ప్రతి పది మంది ఎన్యుమరేటర్లకు ఒక పర్యవేక్షకుడు ఉంటారని తెలిపారు. ప్రతి ఇంటిపైనా సర్వే స్టిక్కర్‌ను అతికించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, అధికారులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

చందానగర్ సర్కిల్‌లో 6 నుంచి..

చందానగర్ : చందానగర్ సర్కిల్– 21 పరిధిలో సమగ్ర కుటుంబ సర్వేను నవంబర్ 6 నుంచి రెండు విడతలుగా చేపట్టనున్నామని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయం వెనుక ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్యాణ మండపంలో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సర్కిల్ 21 పరిధిలో 91,598 ఇళ్లు ఉన్నాయని.. మొదటి విడతలో ఇంటి నంబర్, వివరాలను నమోదు చేసుకొని ఆ ఇంటికి స్టిక్కర్ అతికించాలన్నారు. రెండో విడతలో కుటుంబ సభ్యుల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులం వివరాలు మార్గదర్శక పుస్తకంలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ రాజు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, ప్రాజెక్టు అధికారి ఉషారాణి, డీఈలు స్రవంతి, దుర్గా ప్రసాద్, ఏఈలు ప్రతాప్, ప్రశాంత్, సంతోష్‌రెడ్డి, పారిశుధ్య అధికారి శ్రీనివాస్, ఎస్ఆర్‌పి, ఎస్ఎఫ్ఏ, ఆర్పీలు, ఎంటమాలజీ , సిబ్బంది పాల్గొన్నారు,

ఘనంగా ధన్వంతరి, రుద్రహోమం






రాయదుర్గం: మాస శివరాత్రి, ధన్వంతరి స్వామి జయంతిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి, ఆలయ అర్చకుల సమక్షంలో ఆలయంలో బుధవారం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీ గణపతి, కుబేర లక్ష్మీ, దుర్గా, ధన్వంతరిస్వామి హోమం, నవగ్రహ రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో ధన్వంతరిస్వామి, అన్నపూర్ణాదేవి, గణపతి, కాశీవిశ్వేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

బిల్డర్లపై కేసు నమోదు

చందానగర్ : బిల్డర్లపై కేసు నమోదు చేసిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గౌతమీనగర్‌లోని వీఆర్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లోని పెంట్‌హౌస్ విషయంలో అసోసియేషన్‌కు సదరు నిర్మాణదారుల మధ్య గొడవ జరిగింది. దీంతో అసోసియేషన్ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ చేపట్టి బుధవారం మారుతీ బిల్డర్స్ మేనేజింగ్ పార్టనర్ సుగుణ, వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిరియాల రాఘవరావు, పినపాటి రజనీలపై కేసు నమోదు చేశారు.



సీసీ రోడ్డు.. పది రోజులకే పగుళ్లు

- అధికారుల పర్యవేక్షణ నిల్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు



మియాపూర్: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపంతో పది రోజులకే పగుళ్లు ఏర్పడ్డాయి. మియాపూర్ డివిజన్ పరిధిలోని కృషినగర్ కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ రోడ్డులో గత పది రోజుల కిందట సీసీ రోడ్డు వేశారు. పనుల్లో నాణ్యత పాటించకపోవడం వల్లనే పగుళ్లు వచ్చాయని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీహెచ్ఎంసీ క్వాలిటీ కంట్రోల్ అధికారుల ఉదాసీనత, ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న రోడ్లు పాడవుతున్నాయని విమర్శిస్తున్నారు. కాగా ఈ సమస్యను సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్లగా సీసీ రోడ్డు పూరైన తర్వాత పైన కటింగ్ చేస్తామని ఆ కటింగ్‌లో పగుళ్లు కనబడకుండా చేస్తామని సమాధానం ఇచ్చారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

- లేబర్ కమిషనర్‌కు ఏఐటీయూసీ వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో పనిచేసే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో లేబర్ కమిషనర్ కృష్ణ ఆదిత్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరాజం మాట్లాడుతూ గత ఐదు నెలలుగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈవిషయాన్ని స్థానిక అధికారుల దృష్టికి తీసుకు పోయినా సమస్యను పరిష్కరించలేదన్నారు. స్పందించని ఎడల పెద్ద ఎతున ఆందోళన చేస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు.

భెల్ భవన్స్‌లో మిలాప్ స్నేహ సమ్మేళన్





సాక్షి సిటీబ్యూరో: దీపావళి పండగను పురస్కరించుకుని భెల్ భవన్స్‌లో మిలాప్ స్నేహ సమ్మేళన్‌ను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య కళావైభవం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భవన్స్ హైదరాబాద్ కేంద్ర వైస్ చైర్మన్ గోపాలకృష్ణన్, పాఠశాల విద్యా కమిటీ కోచైర్మన్, భెల్ జీఎం శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభదశలోనే వ్యాధిని గుర్తిస్తే చికిత్స సులువు



హైపర్ టెన్షన్ క్లీనిక్ ప్రారంభోత్సవంలో ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ దీపక్ తదితరులు

మాదాపూర్: ప్రారంభ దశలోనే రక్తపోటును గుర్తించి చికిత్స అందిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఏఐఎన్‌యూ హైటెక్‌సిటీ శాఖ డైరెక్టర్ డాక్టర్ దీపక్ రాగూరి తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్‌సిటీ బ్రాంచ్‌లో బుధవారం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా హైపర్ టెన్షన్ క్లీనిక్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటుతో బాధపడుతున్న రోగుల జీవన ప్రమాణాలను పెంచడం, రక్తపోటు నియంత్రణలో లేకపోవడం వల్ల వచ్చే మూత్రపిండాల సమస్యలకు మెరుగైన సేవలను అందించనున్నట్లు తెలిపారు. ప్రారంభదశలోనే సమస్యలను నివారించడంపై దృష్టిపెడుతున్నట్లు తెలిపారు. అధిక రక్తపోటు వల్ల రక్తప్రవాహం తగ్గుతుందని, మూత్రపిండాల వడపోత పనితీరు దెబ్బతింటుందన్నారు. రోజుకు 30 నుంచి 45 నిమిషాల పాటు నడక, ఆరోగ్యకరమైన బరువు ఉండేలా చూసుకోవడం, ధూమపానం మానేయడం, ఒత్తిడిని నివారించడం, తక్కువ ఉప్పు తీసుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం తదితర జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతా దినోత్సవం

పటాన్‌చెరు టౌన్: గీతం విశ్వవిద్యాలయం రుద్రారంలోని డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)లు బుధవారం సంయుక్తంగా 'జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని' ఉత్సాహభరితంగా నిర్వహించాయి. భారతదేశ ఏకీకరణ కోసం పాటుపడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా గీతం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు ఘననివాళులు అర్పించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పీవీ నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 40, పచ్చిమిర్చి 50, బెండ 70, కాకర 60, దొండ 50, దోస 60, ఆలు 40, చామ 60, కీర 30, బీర 70, వంకాయ 60, గోకర 70, బీన్స్ 140, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 90, క్యాబేజీ 30, క్యారెట్ 70, చిక్కుడు 110, ఉల్లి 70(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 50, సొరకాయ (కేజీ) 30, అల్లం 150, వెల్లుల్లి 350.

మనూలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్



విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

రాయదుర్గం: జాతి శ్రేయస్సు కోసం యువతలో నైతిక విలువలు, సమగ్రతతో కూడిన సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరం ఉందని , వారు ఎంస్కృతిని అనుసరించాలని ఉర్దూ విశ్వవిద్యాలయం చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీఓ) ప్రొఫెసర్ వనజ మహదాసు పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్–2024 కార్యక్రమంలో భాగంగా 'భారతదేశ శ్రేయస్సు కోసం సమగ్రత యొక్క సంస్కృతి' అనే థీమ్‌తో వ్యాసరచన పోటీ , 'జస్ట్ ఏ మినిట్' సెషన్ కార్యక్రమాన్ని 'మనూ' విద్యా, శిక్షణ విభాగం పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ నిర్మాణంలో సమగ్రత, అప్రమత్తత యొక్క ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలో విద్యార్థులు సామాజిక, జాతీయ అభివృద్ధిలో సమగ్రత పాత్రను అన్వేషించడం ద్వారా ఈ థీమ్‌పై వారి ఆలోచనలను ప్రదర్శించారు. జామ్ సెషన్ పాల్గొనేవారిలో వారి ఉచ్ఛారణ, అంశంపై అవగాహన, మాట్లాడే విధానంపై పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. ఈ విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమంలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్స్ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కార్యక్రమంలో డాక్టర్ రఫీ మహ్మద్, జరార్ అహ్మద్, మోహసినా అంజుమ్, ముత్యాలరావు, హబీబ్ అహ్మద్, డాక్టర్ జమీల్ అహ్మద్ పాల్గొన్నారు.

గచ్చిబౌలి డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తా

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌ను అన్నిరంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శంగా మారుస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హామీ ఇచ్చారు. బుధవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, రాయదుర్గం, గోపన్‌పల్లితండాకు చెందిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, సీనియర్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. ఆ తర్వాత ఆయన మాట్లాడుతూ త్వరలోనే గచ్చిబౌలి డివిజన్‌లో పర్యటిస్తామని, కాలనీలు, బస్తీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలను తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణముదిరాజ్, నరేందర్ ముదిరాజ్, సంజీవ, దయాకర్, శ్రీరాములు, నరేందర్‌యాదవ్, శ్యామ్ యాదవ్, యాదయ్య, ఆంజనేయులు, శ్రీశైలం, వేణు ప్రవీణ్‌గౌడ్, దుర్గారామ్, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని జడ్సీకి వినతి

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని బుధవారం కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చందానగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులకు నిధుల మంజూరు, పెండింగ్ పనులను పూర్తి చేయాలని జెడ్సీని కోరామన్నారు. డివిజన్ పరిధిలోని సత్య ఎన్‌క్లేవ్, కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్, శివాజీనగర్ కాలనీలో వరద నీరు చేరుతుందని దాంతో కాలనీవాసులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీలలో వరద నీరు నిలవకుండా ప్రత్యేకంగా వరద నీటి కాలువలను నిర్మించాలన్నారు. అదే విధంగా శ్రీదేవి థియేటర్– అమీన్‌పూర్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని కోరామన్నారు.

సీసీ రోడ్డు పరిశీలన

ఆల్విన్‌కాలని: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ వెస్ట్ కాలనీలో 17 లక్షల రూపాయల నిధులతో చేపట్టిన నూతన సీసీ రోడ్డును డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేయాలని, క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

గంజాయి స్వాధీనం

మియాపూర్: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుండి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ మెట్రోస్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి మియాపూర్ పోలీసులు, ఎస్ఓటీ పోలీసుల వాహన తనిఖీల్లో అటువైపుగా వస్తున్న మహేంద్ర కారును తనిఖీ చేయగా గంజాయి లభించింది. ఒడిశాకు చెందిన లిమ్మ శ్రీకాంత్(34), మహదేవ్ బాగ్(28), గుంటూరుకు చెందిన నాగిరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. కారుతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం.

